'అపార' కష్టాలు

- అపార్‌లో నమోదుకు జతకాని ఆధార్ వివరాలు
- తప్పుల తడకలతో చిరునామా
- అక్షరం తేడా ఉన్నా.. ముందుకు కదలని వైనం
- ఆందోళనలో విద్యార్థులు, తల్లిదండ్రులు
- ఇప్పటికే 82 శాతం నమోదు పూర్తి

తాడేపల్లి రూరల్: దేశ వ్యాప్తంగా విద్యార్థులకు ప్రత్యేక గుర్తింపు సంఖ్య జారీ చేయడానికి కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆటోమేటెడ్ పర్మినెంట్ అకడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ(అపార్)కి ఆధార్ వివరాలు ఆటంకిగా మారుతున్నాయి. ఆధార్ కార్డులో ఉన్న సమాచారం మేరకు అపార్ జారీ అయ్యేలా ఏర్పాట్లు చేశారు. కొంత మంది విద్యార్థులకు సంబంధించిన వివరాలు ఆధార్ కార్డులో తప్పులు తడకలు ఉండటంతో ఆన్‌లైన్‌లో పొందుపరచడానికి సమస్యలు తలెత్తుతున్నాయి. ముందుగా ఆధార్‌లో వివరాలు సరిచేసి తర్వాత అపార్‌లో నమోదు చేపట్టాల్సి ఉంది. ఈ నేపథ్యంలో ఒక్కో పాఠశాలలో 70 శాతానికి అపార్‌లో నమోదైన మరో 30 శాతం నమోదు కావాల్సి ఉంది. నూతన విద్యా విధానంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం ఒన్ నేషన్, ఒన్ స్టూడెంట్ ఐడీ పేరిట ఒకటో తరగతి నుంచి 12 వ తరగతి వరకు విద్యార్థుల వివరాలను అపార్‌లో నమోదు చేసేలా చర్యలు తీసుకుంది. ఈ కార్డు ద్వారా విద్యార్థికి సంబంధించిన వివరాలు పూర్తిగా అందుబాటులో వుంటాయి. దేశంలో ఎక్కడైనా చదవాలన్నా, ఉపాధి అవకాశాలు పొందాలన్నా ఈ శాశ్వత డిజిటల్ గుర్తింపు సంఖ్య ప్రధానం కానుంది. ముఖ్యంగా ధృవపత్రాలు రక్షణకు అవకాశం వుంటుంది.

చాలా మంది విద్యార్థులకు ఆధార్ నమోదులో పుట్టిన సంవత్సరం మాత్రమే నమోదు చేశారు. నెల, తేదీ సరిగా నమోదు చేయలేదు. ఆధార్‌లోని వివరాలు, పాఠశాలలోని వివరాలు సరిపోలినప్పుడే అపార్‌లో నమోదవుతుంది.



మండల విద్యాశాఖ కార్యాలయం



వీవర్స్ కాలనీ హైస్కూలు

పేరులోని అక్షరాలు సైతం ఒకేలా ఉంటేనే ఆన్‌లైన్ ముందుకెళ్లే అవకాశం ఉంది. గ్రామీణ ప్రాంతాల్లో ఆధార్ వివరాలు సరిచేయడానికి తల్లితండ్రులకు సరైన సమాచారం ఉండటం లేదు.

ఆధార్‌లో పుట్టిన తేదీ పరిష్కారానికి పంచాయితీ కార్యదర్శి ఇచ్చే ధృవీకరణ పత్రం వుంటేనే మార్చడానికి అవకాశం వుంటుంది. గ్రామాలలో అధిక శాతం జనన వివరాలు పంచాయతీ కార్యాలయాల్లో నమోదు చేయడం లేదు. రెవెన్యూ శాఖ జనన ధృవీకరణ పత్రాలు జారీ చేస్తేనే ఆధార్‌లో మార్పుకు అవకాశం ఉంటుంది. నవంబర్ 30వ తేదీ లోపు అపార్ నమోదు ప్రక్రియ పూర్తి చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. నగరంలో 126 విద్యా సంస్థలుండగా అందులో 117 ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, 9 జూనియర్ కళాశాలలున్నాయి. మొత్తం విద్యార్థులు 26,455 మంది ఉండగా.. 21,929 మందికి అపార్ నమోదు ప్రక్రియ పూర్తయ్యింది. 4526 మంది విద్యార్థులకు అపార్ నమోదు కావాల్సి ఉంది.

దీనిపై ఎంఈవో బాబు స్పందిస్తూ.. అపార్ నమోదు ప్రక్రియ 82.89 శాతం పూర్తయిందని తెలిపారు. మిగిలిన విద్యార్థులు ఆధార్‌ల కార్డులు సరిచేసి అపార్ నమోదు చేయాల్సి రావడంతో నమోదు ప్రక్రియ ఆలస్యమవుతోందన్నారు. ఆధార్ కార్డులలో తప్పులు సరి చేసి, ఈ నెలాఖరునాటికి అపార్ నమోదు ప్రక్రియ పూర్తి చేస్తామని తెలిపారు.

క్లుప్తంగా

బాలల హక్కులపై అవగాహన



ఫిరంగిపురం: మండల కేంద్రంలోని దీనాపూర్ క్యాంపస్‌లో డాక్టర్ రంజన్‌బాబు కమ్యూనిటీ జూనియర్ కళాశాల, సెయింట్ జేవియర్స్ కళాశాలలు, కార్డ్స్ సంస్థ సంయుక్తంగా శనివారం బాలల హక్కుల వారోత్సవాలు నిర్వహించాయి. విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా జిల్లా నోడల్ అధికారి టి.శ్రీవాణి పాల్గొని, మాట్లాడారు. హక్కుల పరిరక్షణ, రక్షణ తంత్రాలు, వివిధ హెల్ప్‌లైన్ నంబర్లను తెలిపారు. ఈ కార్యక్రమంలో బాల బాట జాయింట్ డైరెక్టర్ టి.పుష్పలత, ప్రిన్సిపల్ డి.జీవన్ మణిబాబు, సి.విజయ్‌కుమార్, బి.విజయ్‌కుమార్, టి.దుర్గాభవాని, బి.వాసంతి, షేక్, అబ్దుల్ రషీద్, జి.రవి, జి.అభిలాష్, ప్రిన్సిపల్ డి. సుదర్శన్ పాల్గొన్నారు.

సంచార గ్రంథాలయం ప్రారంభం



మంగళగిరి: సంచార గ్రంధాలయాన్ని ఏపీఎంఐడీసీ చైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావు శనివారం ప్రారంభించారు. పట్టణంలోని బ్యాంక్ స్కూలు వద్ద డాక్టర్ ఆకురాతి కోదండ రామయ్య సంచార గ్రంథాలయాన్ని ఏర్పాటు చేశారు. శ్రీనివాసరావు మాట్లాడుతూ సంచార గ్రంథాలయంతో గ్రామీణ ప్రజలకు ఎంతో ఉపయోగమన్నారు. పద్మశాలి అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ నందం అబద్దయ్య , న్యాయవాది మాదిరాజు గోవర్ధనరావు, రిటైర్డ్ ప్రిన్సిపల్ ఎం.విజయమోహన్ పాల్గొన్నారు.

నోటికి నల్ల రిబ్బన్లతో కార్మికుల నిరసన



తాడేపల్లిరూరల్: బ్రహ్మానందపురం ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికుల నిరసన కొనసాగుతోంది. శనివారం కార్మికులు నోటికి నల్ల రిబ్బన్లు ధరించి, దీక్ష కొనసాగించారు. తమ నిరసనను వ్యక్తం చేశారు. తాడేపల్లి పట్టణ కార్యదర్శి వేముల దుర్గారావు మాట్లాడుతూ యాజమాన్యం నిర్లక్ష్యానికి మూల్యం చెల్లించక తప్పదని, కార్మికులు అర్ధాకలితో, ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతుంటే యాజమాన్యం పట్టించుకోకపోవడం సరికాదన్నారు. ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకుని సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు కె. స్టీవెన్, ఆశీర్వాదనం, యెహోషువా, ఇస్రాయిల్, సాంబయ్య, నవనీతం, ఎం. సామ్రాజ్యం, శారద సారమ్మ తదితరులు పాల్గొన్నారు.

పుస్తకావిష్కరణ



మంగళగిరి: ప్రభుత్వంలో జరుగుతున్న మంచి, చెడులను ప్రజలకు తెలియజేయాల్సిన బాధ్యత జర్నలిస్టులపై ఉందని రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారధి పేర్కొన్నారు. పట్టణంలోని ఎన్ఆర్ఐ జంక్షన్‌లోని ఫంక్షన్ హాలులో శనివారం సీనియర్ జర్నలిస్టు ఈపూరి రాజారత్నం రచించిన జర్నలిజం..జర్నలిస్టులు అనే పుస్తకాన్ని మంత్రి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ జర్నలిజంలో బేసిక్స్ తెలుసుకోవడానికి పుస్తకం దోహదపడుతుందన్నారు. ఎప్పుడైతే జర్నలిస్టు నిజాయితీతో చిత్తశుద్ధితో పని చేస్తాడో అప్పుడే ప్రజాస్వామ్యం పది కాలాలపాటు మనగలుగుతుందన్నారు. రచయిత ఈపూరి రాజారత్నం, లోకం చెప్పని నిజం ఎడిటర్ ఎస్‌కే రఫీ, టీడీపీ నాయకుడు మల్లవరపు వెంకట్, టీవీ 18 డైరెక్టర్ ఈపూరి శేషగిరి పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ మంగళగిరి ఇన్‌చార్జి షేక్ సలీం

లక్ష్మీపురం: కాంగ్రెస్ పార్టీ గుంటూరు పార్లమెంట్ పరిధిలోని ఏడు నియోజకవర్గాలకు ఇన్‌చార్జిలను ఎంపిక చేసినట్లు జరిగిందని జిల్లా అధ్యక్షులు చిలకా విజయ్‌కుమార్, మాజీ శాసన సభ్యులు లింగంశెట్టి ఈశ్వరరావు అన్నారు. స్థానిక మార్కెట్ సెంటర్‌లోని పార్టీ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో వివరాలు వెల్లడించారు. గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జిగా రాచకొండ జాన్‌బాబు, తూర్పు ఇన్‌చార్జిగా షేక్ మస్తాన్‌వలి, తెనాలి ఇన్‌చార్జిగా చందు సాంబశివుడు, పొన్నూరు ఇన్‌చార్జిగా గాదె నాగేశ్వరరావు, మంగళగిరి ఇన్‌చార్జిగా షేక్ సలీం, తాడికొండ ఇన్‌చార్జిగా చిలకా విజయ్‌కుమార్, ప్రత్తిపాడు ఇన్‌చార్జిగా కొరివి వినయ్‌కుమార్‌లను నియమించినట్లు చెప్పారు. కార్యక్రమంలో పీసీసీ ఉపాధ్యక్షుడు, జిల్లా ఇన్‌చార్జి



ఇన్‌చార్జిలను అభినందిస్తున్న నాయకులు విజయ్‌కుమార్, లింగంశెట్టి ఈశ్వరరావు

శ్రీపతి ప్రకాశం, జిల్లా ప్రధాన కార్యదర్శి, ఆఫీస్ ఇన్‌చార్జి బిళ్లా సునిల్, గడ్డం పాల్ విజయ్ కుమార్ పీసీసీ ప్రధాన కార్యదర్శి బొట్ల బ్రహ్మయ్య రాహుల్, యూత్ అధ్యక్షులు మల్లెల మోషే పాల్గొన్నారు.

రాజకీయ ప్రయోజనాల కోసం రాజీవ్ రంజన్ మిశ్రా కమిషన్

మంగళగిరి: ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణకు రాష్ట్ర ప్రభుత్వం నియమించిన రాజీవ్ రంజన్ మిశ్రా కమిషన్‌ను పూర్తిగా వ్యతిరేకిస్తున్నామని, సుప్రీంకోర్టు ఇచ్చిన రాజ్యాంగ వ్యతిరేక వర్గీకరణ క్రిమిలేయర్ తీర్పు రద్దు చేయాలని మాల సంఘాల అధ్యక్షుడు మల్లెల వెంకటరావు డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలోని ఐబీఎన్ భవన్ ప్రెస్ క్లబ్‌లో విలేకరుల సమావేశం నిర్వహించి, మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వానికి ఎస్సీల స్థితిగతులను అధ్యయనం చేసేందుకు ప్రత్యేక కమిషన్ నియమించే అధికారం లేదన్నారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 338 ప్రకారం జాతీయ ఎస్సీ కమిషన్ ఉండగా వేరొక కమిషన్ వేయడం రాజకీయ, ఓట్‌బ్యాంక్ ప్రయోజనాల కోసమనేని విమర్శించారు. మాల సామాజిక వర్గాన్ని అణచి వేసేందుకే రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నిస్తుందని ఆరోపించారు. ఏదో విధంగా తప్పుడు లెక్కలతో మాదిగలకు ఎక్కువ ప్రయోజనాలు కల్పించే ప్రయత్నాలు చేస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనకు సిద్ధమవుతున్నట్లు తెలిపారు. మహానాడు జాతీయ అధ్యక్షుడు చీకటిమల్లి మంగరాజు, రాష్ట్ర అధ్యక్షుడు గోదా జాన్‌పాల్, బేతాళ శరత్‌బాబు, దళిత సంఘాల ఐక్య వేదిక నాయకుడు చప్పిడి వెంగళరావు, జై భీమ్ పీపుల్స్ జేఏసీ అంబటి కొండలరావు, దండేల కృష్ణ, జి.శుభకర్ పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాల సంఘాల నాయకులు

మాదక ద్రవ్యాల దుష్పరిణామాలపై అవగాహన

మంగళగిరి: నిషేధిత మత్తు పదార్థాలకు ప్రతి ఒక్కరూ దూరంగా వుండాలని మానసిక వికాస కేంద్రం జోనల్ కో-ఆర్డినేటర్ బి.రమేష్ తెలిపారు. నగర పరిధిలోని చినకాకాని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నవజీవన్ బాల భవన్ ఆధ్వర్యంలో శనివారం బాలల హక్కుల వారోత్సవాల్లో భాగంగా మాదక ద్రవ్యాలు..ఆరోగ్యంపై ప్రభావం అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. 50 ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో ఈ నెల 14 వ నుంచి 20 వ తేదీ వరకు వివిధ రకాల పోటీలు నిర్వహించడం జరుగుతుందన్నారు. విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఉపాధ్యాయులు లక్ష్మీనారాయణ, పద్మావతి దేవి, దుర్గాప్రసాద్, పద్మలత పాల్గొన్నారు.



విద్యార్థినికి బహుమతి ప్రదానం

తాడేపల్లిలో..

తాడేపల్లిరూరల్ : తాడేపల్లి శాఖా గ్రంథాలయంలో శనివారం విద్యార్థులకు మాదక ద్రవ్యాల ప్రభావం అనే అంశంపై వ్యాస రచన పోటీలను నిర్వహించారు. ముఖ్య అతిథి స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు కాటూరి రాంబాబు కార్యక్రమాన్ని ప్రారంభించారు. న్యాయ నిర్ణేతలుగా ఉపాధ్యాయులు వైష్ణవి, సీత వ్యవహరించారు. గ్రంథాలయ అధికారి నాగుర్ బాషా పాల్గొన్నారు.



వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

బాల్య వివాహాలను అరికట్టాలి

పొన్నెకల్లు(తాడికొండ): బాల్య వివాహాలను అరికట్టాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఐసీడీఎస్ పొన్నెకల్లు సెక్టార్ సూపర్ వైజర్ సీహెచ్ కళావతి అన్నారు. చైల్డ్ రైట్స్ అడ్వకేసీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పొన్నెకల్లు జెడ్పీ ఉన్నత పాఠశాలలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సమాజంలో మహిళలు, బాలలపై లైంగిక వేధింపులు అధికమవుతున్నాయన్నారు. చిన్నారులకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ఫౌండేషన్ జిల్లా సమన్వయకర్త కోలా సమీర్ మాట్లాడుతూ బాలికలు, మహిళలపై నేరం జరిగినపుడు 1930 టోల్ ఫ్రీ నంబరుకు ఫిర్యాదు చేయాలన్నారు. స్థానిక మహిళా సంరక్షణ కార్యదర్శిని కలిసి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయొచ్చన్నారు. 1098, 100, 181 హెల్ప్‌లైన్ నంబర్లు అందుబాటులో ఉన్నాయన్నారు. ట్రైనింగ్ కో-ఆర్డినేటర్ సీహెచ్ ప్రభాకర్, హెచ్ఎం జరీనా, కమ్యూనిటీ హెల్ ఆఫీసర్ జగదీష్, క్రాప్ జిల్లా కో-ఆర్డినేటర్ వెంకట్ సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కళావతి

ఆరు తరాల ఆత్మీయ సమ్మేళనం

మంగళగిరి: ఆరు తరాలకు చెందిన ఓ కుటుంబ సభ్యులు ఒక చోటకు చేరారు. ఒకరిని ఒకరు కలుసుకుని ఆత్మీయ అనురాగాలను పంచుకున్నారు. పెదవడ్లపూడి గడ్డిపాటి కల్యాణ మండపం శనివారం ఇందుకు వేదికైంది. గ్రామానికి చెందిన దివంగత షేక్ అబ్దుల్ రహమాన్, గాలిబ్ దంపతులకు 8 మంది కుమార్తెలు, కుమారుడు. వీరికి సంబంధించిన సుమారు 320 మంది కుటుంబ సభ్యులున్నారు. ఆ కుటుంబాలు వివిధ ప్రాంతాల్లో నివాసముంటున్నాయి. ఆత్మీయ సమ్మేళనానికి 250 మంది హాజరయ్యారు. బంధువులంతా ఒకరి యోగ క్షేమాలు తెలుసుకుంటూ ఆనందంగా గడిపారు.



కొనసాగుతున్న గ్రంథాలయ వారోత్సవాలు

ఫిరంగిపురం: గ్రంథాలయ వారోత్సవాలు శనివారం కొనసాగాయి.విద్యార్థులకు వ్యాస రచన, వక్తృత్వ, ఆటల పోటీలు నిర్వహించారు. అలాగే గ్రంథాలయ ఉద్యమకారుల సేవలను వివరించారు.

- ఫిరంగిపురం మండల కేంద్రంలోని గాలిబాలీ శాఖ గ్రంథాలయంలో విద్యార్థులకు మ్యూజికల్ చైర్స్ పోటీ నిర్వహించారు. సెయింట్‌పాల్స్, సెయింట్ ఆన్స్, అల్లంవారిపాలెం జెడ్పీ పాఠశాలల విద్యార్థులు 90 మంది పాల్గొన్నారు. ఇంచార్జి గ్రంథాలయాధికారి పి.జేమ్స్‌బాబు, బీడీసీఎల్‌వోలు దివి కృష్ణమూర్తి, షేక్ సైదాసాహెబ్ విశ్రాంత ఉపాధ్యాయుడు కె.పోతురాజు పాల్గొన్నారు.

మంగళగిరి: నగర పరిధిలోని నూతక్కి, మంగళగిరి శాఖా గ్రంథాలయాల్లో వివిధ కార్యక్రమాలు నిర్వహించారు. గ్రంథాలయ పితామహులు అయ్యంకి వెంకటరమణయ్య, ఎస్.రంగనాథన్, పాతూరి నాగభూషణం చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. జొన్నల శివరామిరెడ్డి, బ్రహ్మానందరెడ్డి, లైబ్రేరియన్ ఎస్.నరసింహారావు, సీకే జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ రత్నబాబు, లెక్చరర్ ఎస్.ఆనందరావు, లైబ్రేరియన్ ఎన్.ఆరోగ్యం పాల్గొన్నారు.

తాడికొండ: స్థానిక గ్రంథాలయంలో శనివారం గ్రంథాలయ ఉద్యమ నాయకులు అయ్యంకి వెంకటరమణయ్య, పాతూరి నాగభూషణం, ఎస్ఆర్ రంగనాథన్‌ల విగ్రహాలకు ఘనంగా నివాళులర్పించారు. సీపీఎం మండల కార్యదర్శి చింతల భాస్కరరావు కార్యక్రమాన్ని ప్రారంభించారు. విశ్రాంత ఎంపీహెచ్‌వో కందుల గోపాలరావు, గ్రంథాలయాధికారులు జి శ్రీనివాసరావు, నాగమల్లేశ్వరి, వేమేశ్వరరావు, షేక్ బిలాల్, అప్పారావు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

- తుళ్లూరు గ్రంథాలయంలో విద్యార్థులకు వక్తృత్వ పోటీలు నిర్వహించారు. గ్రంథాలయాధికారి గిరిధర్ కుమార్ ఆధ్వర్యంలో మండలంలోని పలు పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. ఉపాధ్యాయులు కె.హనుమంతరావు, డి.జానకి పాల్గొన్నారు.



పోటీలో పాల్గొన్న విద్యార్థులు



నూతక్కి గ్రంథాలయంలో విద్యార్థులు



గ్రంథాలయోద్యమ ప్రముఖులకు నివాళి

ఎమ్మెల్సీ ఎన్నికలకు 2,150 అర్జీలు

తాడికొండ: ఎమ్మెల్సీ ఎన్నికలకు మొత్తం 2,150 అర్జీలు రాగా 624 అర్జీలను ఆమోదించడం జరిగిందని, మిగిలిన వాటిని ఈ నెల 19 లోపు పూర్తి చేసి ఓటర్ల ముసాయిదా జాబితా విడుదల చేయనున్నట్లు తహసీల్దారు కె.నాసరయ్య తెలిపారు. శనివారం తాడికొండ ఎస్‌వీవీ ఉన్నత పాఠశాలలో ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి నియోజకవర్గంలోని గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అడుసుమల్లి యశోదమ్మ భవనంలో ఎమ్మెల్సీ ఎన్నికలకు 155,156 బూత్‌ల ఏర్పాటుపై చర్చించారు. డిసెంబరు 9వ తేదీ వరకు ఎమ్మెల్సీ ఓటు కోసం నవరణలకు అర్జీలను స్వీకరిస్తారని చెప్పారు. రాజకీయ పార్టీలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల డీటీపీ మోహినికుమారి, డిప్యూటీ తహసీల్దారు నిర్మలకృష్ణ, ఎలక్షన్ సీనియర్ అసిస్టెంట్ నల్లా పలు పార్టీల నాయకులు పాల్గొన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న తహసీల్దారు నాసరయ్య

డిక్మన్ కళాపరిషత్ వ్యవస్థాపకుడు రాజారావు మృతి



రాజారావు

ఫిరంగిపురం: డిక్మన్ కళా పరిషత్ వ్యవస్థాపక అధ్యక్షుడు పి.రాజారావు(67) శనివారం ఉదయం అనారోగ్యంతో మృతిచెందారు. ఫిరంగిపురం గ్రామానికి చెందిన రాజారావు పంచాయతీ కార్యదర్శిగా పలు గ్రామాల్లో పనిచేసి రిటైడ్ అయ్యారు. డిక్మన్ కళా పరిషత్‌ను స్థాపించి ఏటా బాల ఏసు దేవాలయంలో క్రిస్మస్ పండుగను పురస్కరించుకొని రాష్ట్ర స్థాయి నాటికల పోటీలు నిర్వహించేవారు. నటుడిగా, దర్శకుడిగా అనేక నాటకాలు ప్రదర్శనల్లో పాల్గొన్నారు. రాజారావు మృతికి పలువురు సంతాపం తెలిపారు. వారిలో మండవ.నరసింహారావు, అయ్యప్పరెడ్డి, సీహెచ్ వీరారెడ్డి, పీఎల్ మరియన్న, ఎన్.అప్పయ్య, పి.సుబ్బారెడ్డి ఉన్నారు.

అనుమతుల్లేని హోర్డింగ్స్, బ్యానర్ల తొలగింపు

మంగళగిరి: నగర పాలక సంస్థ అనుమతులు లేకుండా నగరంలో ఏర్పాటు చేసిన హోర్డింగ్స్, బ్యానర్లు తొలగించి, ఏర్పాటు చేసిన వారిపై చర్యలు తీసుకుంటామని నగర కమిషనర్ ఆలీం బాషా శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. నగర పాలక సంస్థ పరిధిలోని డివైడర్లు, రోడ్లు కూడళ్లు, బహిరంగ ప్రదేశాలు, ప్రైవేటు స్థలాలు, రహదారుల వెంబడి ఏర్పాటు చేసిన రాజకీయ, వాణిజ్య, సినిమా, విద్యా సంస్థ, హాస్పిటల్, ప్రైవేటు ఫంక్షన్లకు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు, బ్యానర్లు తొలగిస్తామని పేర్కొన్నారు. ముందస్తు అనుమతి పొందిన వారికి కూడా 24 గంటలు నిర్దిష్ట గడువు మాత్రమే ఇస్తామని తెలిపారు.

ఉచిత ఇసుక.. అనుమతి తప్పనిసరి

తాడేపల్లిరూరల్: దుగ్గిరాల మండల పరిధిలోని నదీ తీర ప్రాంతాల్లోని గ్రామాల్లో ఉచితంగా ఇసుక తరలించే వారికి అనుమతి తప్పనిసరి అని తహసీల్దార్ సునీత శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కృష్ణానది పరీవాహక ప్రాంతాలైన వీర్లపాలెం, పెదకొండూరు, గొడవర్రు గ్రామాల ప్రజలు నిర్మాణ అవసరాల నిమిత్తం ఉచితంగా ఇసుకను రవాణా చేసుకొనవచ్చన్నారు. అందుకు rand.a p.gov.in వెబ్‌సైట్ ద్వారా రసీదు పొందవచ్చని పేర్కొన్నారు. లేదా గ్రామ సచివాలయాల్లో డీఏను సంప్రదిస్తే.. రసీదును అందజేస్తారని పేర్కొన్నారు. లేకుంటే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు.

బైక్‌ను సీజ్ చేయించిన న్యాయమూర్తి

తెనాలిరూరల్: నంబరు ప్లేటుపై వాహన రిజిస్ట్రేషన్ నంబరు బదులు సినీ, రాజకీయ నాయకులు ఫోటోలు పెట్టడం, వారి తాలూకా అంటూ రాయించి ఉంచుతుండడాన్ని హైకోర్టు న్యాయవాది పెరికల డేనియేల్ ప్రి లిటిగేషన్ కేసు వేశారు. దీనిపై విచారించిన మండల లీగల్ సెల్ కమిటీ చైర్మన్‌ఓ బైక్‌ను సీజ్ చేయించారని న్యాయవాది శనివారం తెలిపారు. పట్టణంలో ట్రాఫిక్ సమస్యలపై తాను వేసిన ప్రి లిటిగేషన్ కేసు విచారణకు రావడంతో న్యాయమూర్తి బైక్‌ను సీజ్ చేయించి తదుపరి చర్యల కోసం ఆర్టీవో అధికారులకు అప్పగించినట్టు వివరించారు. మైనర్లు వాహనాలు నడపడం, చంటి పాపలతో భిక్షాటన చేయడం వంటి అంశాలను న్యాయమూర్తి దృష్టికి తీసుకెళ్లగా ఈ నెల 30వ తేదీకి వాయిదా వేశారని తెలిపారు.

నేడు వైఎస్సార్ సీపీ విస్తృత స్థాయి సమావేశం

తాడేపల్లి రూరల్ : తాడేపల్లి పట్టణ పరిధిలోని వైఎస్సార్ సీపీ ముఖ్య నాయకుల, కార్యకర్తల సమావేశాన్ని ఆదివారం ఉదయం 10 గంటలకు నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్ సీపీ తాడేపల్లి పట్టణ అధ్యక్షుడు బుర్రముక్కు వేణుగోపాల సోమిరెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి మంగళగిరి పార్టీ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి, ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, వైఎస్సార్ సీపీ చేనేత విభాగం అధ్యక్షుడు చిల్లపల్లి మోహనరావు తదితరులు పాల్గొంటారని పేర్కొన్నారు. నియోజకవర్గ పార్టీ కార్యాలయంలో జరిగే ఈ కార్యక్రమానికి అందరూ హాజరు కావాలని తెలిపారు.

నేడు గౌడ సంఘం వన సమారాధన

తాడేపల్లిరూరల్ : ఇప్పటం గ్రామంలోని మామిడి తోటలో కార్తిక మాసాన్ని పురస్కరించుకుని గౌడ సంఘం వన సమారాధన ఆదివారం నిర్వహించనున్నట్లు తాడేపల్లి మండల గౌడ సంఘం నాయకులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏపీ రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్, ఏపీఎస్ ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణ, పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్, సినీ నటుడు తల్వార్ సుమన్, గౌడ సంఘం నాయకులు, ప్రజా ప్రతినిధులు పాల్గొననున్నట్లు పేర్కొన్నారు. గౌడ సంఘం నాయకులు, ప్రజలు కుటుంబంతో సహా పాల్గొనాలని తెలిపారు.

ఇంటి స్థలమిచ్చే వరకు పోరు

మంగళగిరి: పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించే వరకు ప్రభుత్వంపై పోరు కొనసాగుతుందని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జంగాల అజయ్ కుమార్ తెలిపారు. పట్టణంలోని నాల్గవ వార్డులో శనివారం పేదల నుంచి ఇళ్ల స్థలాల కోసం దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా అజయ్ కుమార్ మాట్లాడుతూ ఎన్నికలలో ఇచ్చిన హామీలో భాగంగా ప్రభుత్వం వెంటనే గ్రామాల్లో మూడు, పట్టణంలో రెండు సెంట్ల ఇంటి స్థలం కేటాయించాలని కోరారు. నిర్మాణానికి రూ.5 లక్షలు మంజూరు చేయాలన్నారు. నాయకులు నందం బ్రహ్మేశ్వరరావు, చిన్ని సత్యనారాయణ, ముక్కంటి, దొడ్డి ఈశ్వరరావు, దేవర వెంకటేశ్వర్లు, తోట శివశంకర్ పాల్గొన్నారు.

నేడు ఉచిత మెగా కంటి వైద్య శిబిరం

తాడికొండ: తుళ్లూరు హెచ్‌ఎస్ఆర్ కల్యాణ మండపంలో ఉచిత మెగా కంటి వైద్య శిబిరం ఆదివారం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు బండ్ల చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు బండ్ల పట్టాభిరామయ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించే ఈ వైద్య శిబిరంలో అన్ని రకాల కంటి వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు, అవసరమైన కళ్లజోళ్లు పంపిణీ చేస్తారని పేర్కొన్నారు.

షుగర్, బీపీ పరీక్షలు చేయించుకోండి

తెనాలిఅర్బన్: హెచ్ఐవీతో బాధపడే వారు తప్పనిసరిగా షుగర్, బీపీ పరీక్షలు చేయించుకుంటూ ఉండాలని జిల్లా వైద్యశాలలోని ఏఆర్‌టీ సెంటర్ నోడల్ ఆఫీసర్ డాక్టర్ అంకినీడు ప్రసాద్ సూచించారు. ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ, షేర్ ఇండియా సహకారంతో ఏఆర్‌టీ సెంటర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన బీపీ, షుగర్ పరీక్షల కేంద్రాన్ని శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెరుగైన వైద్యసేవలు అందించాలనే ఉద్దేశంలో క్యాన్సర్; బీపీ, షుగర్ పరీక్షలు అందుబాటులోకి తీసుకువచ్చినట్లు చెప్పారు. కార్యక్రమంలో జిల్లా సూపర్‌వైజర్ జ్యోతులు వీరాస్వామి, ఏఆర్‌టీ సెంటల్ మెడికల్ ఆఫీసర్‌లు డాక్టర్ రమ్యకృష్ణ, డాక్టర్ స్నేహ, షేర్ ఇండియా ప్రాజెక్టు ఆఫీసర్ రత్నకుమార్, డేటా మేనేజర్ శ్రీకాంత్, కోటేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.